# మీరు చదివారా?

## – కృష్ణవేణి





(నెలనెలా ఓ పుస్తకం – సమగ్రపరిచయం)

## The Inheritance of Loss

## కిరణ్ దేశాయ్







కిరణ్ దేశాయ్, రచయిత్రి అనితా దేశాయ్ కుమార్తె. సెప్టెంబర్ 1971లో ఢిల్లీలో పుట్టి– పూణే, ముంబయిల్లో 14 ఏళ్ళు వచ్చేవరకూ ఉండి, ఆ తరువాత తల్లీతండ్రీతో పాటు ఇంగ్లాండ్ వెళ్ళారు. ఏడాది తరువాత అమెరికా వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు.

ఆమె తొలి నవల 'హల్లబలూ ఇన్ ద గ్వావా ఓర్చార్డ్' 1998లో పబ్లిష్ అయి, బెట్టీ ట్రాస్క్ అవార్డ్ పొందింది. నవలను రచయిత సల్మాన్ రష్డీ, ఎంతగానో ప్రశంసించారు. రెండవ పుస్తకం, 'ద ఇన్హెరిటెన్స్ ఆఫ్ లాస్' 2006లో వచ్చింది. ఇది 2007లో మాన్ బుకర్ ప్రైజే కాక 2006 'నేషనల్ బుక్ క్రిటిక్స్ సర్కిల్ ఫిక్షన్' అవార్డు కూడా గెలుచుకుంది. ఈ నవల రాస్తున్నప్పుడు దేశాయ్ న్యూయార్క్, మెక్సికో, ఇండియా తిరుగుతూ– దేశదిమ్మరిలా గడిపారు. ఆ ఏడేళ్ళ శ్రమ ఫలితం యీ పుస్తకం. అప్పుడు బుకర్ ప్రైజ్ గెలుచుకున్న వాళ్ళల్లో అతి చిన్న వయస్సు గల స్త్రీ దేశాయ్.

★★★

1986లో మొదలయిన పుస్తకపు నేపథ్యం, ఈశాన్య హిమాలయాలున్న కాలింపోంగ్. జడ్జ్‌గా రిటైర్ అయిన జెమూభాయ్ పటేల్‌కు భారతీయ సాంప్రదాయాలంటే అయిష్టం. రొట్టెలని కూడా కత్తీ ఫోర్క్‌తో తినే వ్యక్తి. తండ్రితో సహా భారతీయులందరినీ అసహ్యించుకుంటాడు. భార్యని హింసించి తన తండ్రి వద్దే వదిలిపెడతాడు. కూతురు, అల్లుడు యూరప్లో కారు ప్రమాదంలో చనిపోయిన తరువాత, తన భార్యను పెట్టిన కష్టానికి ఆధ్యాత్మిక వెల చెల్లిస్తూ, 17 ఏళ్ళ మనవరాలైన సాయిని తన పాడుపడుతున్న ఇంట్లో ఉండనిస్తాడు. ఆ ఇంట్లో వంటతను, పెంపుడు కుక్కయిన మట్ కూడా ఉంటారు.

సాయి తనకు ట్యూషన్ చెప్పడానికి వచ్చే నేపాలీ యువకుడు గ్యాన్‌తో ప్రేమలో పడుతుంది. అయితే, అతను నూరు శాతం నేపాలీ, ఆమె పాశ్చాత్య విద్యనభ్యసించిన ఎగువ తరగతి యువతి అయినందువల్ల వారి ప్రేమ సఫలమయ్యే ప్రశక్తే ఉండదు. వంటతను వాళ్ళిద్దరినీ ఒక కంట కనిపెడుతూ ఉంటాడు. పని కోసం అమెరికా వెళ్ళిన తన కొడుకు బిజూ గురించి వ్యాకులపడుతుంటాడు.

వొకరోజు సాయి, గ్యాన్ కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. జడ్జ్ పడక్కుర్చీలో కునుకు తీస్తుంటాడు. గోర్ఖాలాండ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ సభ్యులు

కొంతమంది ఇంట్లోకి చొరపడతారు. కుక్క సహాయం ఉండదు: *'మట్ అపరిచితులని కలుసుకున్నప్పుడు చేసేదే, ఇప్పుడూ చేసింది. అపరిచితులకు సిగ్గూ, ఆశా కనపరుస్తూనే, కోపంగా తోకాడించడం మొదలెట్టింది.'* ఆ సభ్యులు ఇంట్లో ఉన్న భోజనం, మద్యం, తుపాకులు, ఒక పాతకాలపు ట్రంకు పెట్టెను దొంగిలిస్తారు. ఎవరికైనా తెలపాలన్నా, ఇంట్లో ఫోనుండదు. వారికోసం టీ పెట్టవలిసి వచ్చినప్పుడు జడ్జి ఆ పరాభవాన్ని భరించలేకపోతాడు. అప్పుడు, *'సాయి, వంటతను, అటువైపు చూడకుండా ఉండే ప్రయత్నం చేస్తూ తమ దృష్టి మళ్ళించుకుంటారు.'* ఆ ప్రాంతం ఎదురుకుంటున్న రాజకీయ పోరాటం, సామాజిక విచ్ఛిన్నత– పాఠకులకు పరిచయం అవుతాయి.

మర్నాడు ఈ సంఘటన గురించి పోలీసులకు రిపోర్ట్ చేయమని జడ్జ్ వంటతన్ని పంపినప్పుడు, అతను నిమ్నజాతివాడు కనుక ఆ నేరంలో వంటతనికీ భాగం ఉందంటారు పోలీసులు. కేసు విచారణకోసం వాళ్ళు వచ్చి, జడ్జ్ ఇంటిని ధ్వంసం చేస్తారు తప్ప చొరబాటుదారులెవరో కనుక్కోలేకపోతారు. స్వాభిమానం కోల్పోయిన వంటతని బాధని సాయి చూడలేకపోతుంది.

సాయికి తెలియకుండా గ్యాన్ విద్రోహుల గుంపులో చేరి, ఆమె వద్దకి రావడం ఆపేస్తాడు. సంగతేమిటో కనుక్కునేటందుకు ఆమె అతని వద్దకు వెళ్ళినప్పుడు, *'సాయి అద్భుతమైన అమ్మాయేమీ కాదు. తన చుట్టూ ఉన్న వైరుధ్యాలన్నిటి ప్రతిబింబం మాత్రమే.'* అనుకుని, ఆమెను వెనక్కి పంపుతాడు. దీనికి సమానాంతరంగా, వంటతని కొడుకు బిజూ కథ నడుస్తుంది. అతని వద్ద చట్టబద్ధమైన పత్రాలేవీ లేకుండానే, న్యూయార్కులో ఉంటూ రెస్టరెంట్లో వంట చేస్తుంటాడు. బిజూ భారతీయుడు అయినందువల్ల అతన్ని అందరూ చిన్నచూపు చూసేవారే. భారతదేశవాసుల కన్నా తక్కువ స్థాయి వారని బిజూ అనుకున్న పాకిస్తానీలూ అతన్ని ఎగతాళి చేయడంలో తీసిపోరు. తనూ తండ్రిలాగా ఒక నౌకరే అని గుర్తించిన బిజూ, ఉన్న కొద్ది పాటి డబ్బుతో ఇంటిదారి పడతాడు.

ఇండియాలో రాజకీయ పరిస్థితి దిగజారుతుంటుంది. అప్పటివరకూ తాము గడిపిన జీవితాలతో అసంతృప్తి చెందిన పాత్రలన్నీ వాటిని మార్చుకునే ప్రయత్నాలు చేస్తాయి.

★★★

పుస్తకంలో ఉన్న హాస్య సన్నివేశాల్లో కూడా విషాదపు ఛాయలుంటాయి.

బిజూ అనుభవమే ఒకానొకప్పుడు జడ్జికీ ఎదురవుతుంది. అతను 1940లలో ఇంగ్లాండ్లో చదువుకుంటున్నప్పుడు– ఎన్నో ఆదర్శాలు మోసుకుని అక్కడ దొరికే అవకాశాలను అందిపుచ్చుకుందామన్న వ్యక్తి, తను సెకండ్ క్లాస్ సిటిజెన్ని మాత్రమే అని గుర్తించగానే, దేశం వెనక్కి వస్తాడు.

నవల్లో భోజనానికి ఉన్న ప్రాముఖ్యత ఇంతా అంతా కాదు. పాత్రలన్నీ తాము తినే పదార్థాలతో నిస్పృహని జయిస్తూ, ఓదార్పు పొందడానికి ప్రయత్నిస్తాయి. సాంస్కృతిక గుర్తింపును వెతుక్కుంటాయి. జీవితమంతా బ్రిటిష్ వారి 'ఇండియన్ సివిల్ సర్వీసెస్' లో పని చేసిన జడ్జ్, ఎప్పుడూ దీర్ఘంగా ఆలోచిస్తూ, 'టీతోపాటు కేక్, స్కోన్, ఛీస్ స్ట్రాస్ ' కావాలంటాడు. వంటవాడిని పనిలో పెట్టుకున్నప్పుడు, *'చేపలమీద వైట్ సాస్ జల్లు. మటన్ మీద బ్రౌన్ సాస్ వేయాలి.'* అంటూ, తన రుచులు అతనికి నేర్పిస్తాడు. బిజూ తండ్రికి రాసే ఉత్తరాల్లో *'ఫ్రైడ్ చికెన్, హాట్ టొమాటో'* వివరాలుంటాయి.

ఇవన్నీ పక్కన పెడితే, పాత్రలకి మాత్రం ఒకరితో మరొకరు కలిసి, సంభాషించుకునే సామర్థ్యం ఉండదు. ఇండియానుండి న్యూయార్క్ వరకూ ప్రయాణించే నవల– మధ్య తరగతి, కింద తరగతి జీవితాలని స్పష్టంగా వివరిస్తుంది. ఆ జీవితాల తేడాని ఒడిసి పట్టుకుంటుంది. ఉపయోగించినది– వాడుకభాష, సాహిత్య సంబంధమైన భాషల మిశ్రమం. ఇండియాలోనూ బయట దేశాల్లోనూ ఉండే భారతీయుల కఠినమైన వర్గ వ్యవస్థల గురించిన యీ నవల, *'ఇండియా అస్పష్టంగా భూటాన్ మరియు సిక్కిమ్‌లోకి అడుగు పెట్టినప్పుడు, చిందరవందరగా అయిన భూగోళపటం'* నేపథ్యంగా రాయబడినది.

★★

COMMENTS